కళా విహీనం.!

కళ తప్పిన కాలనీ వనాలు ■ ఏడాది కాలంగా పార్కుల నిర్వహణ గాలికి..

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.కోట్లు వెచ్చించి పార్కుల అభివృద్ధి
- ప్రస్తుతం ఆలనా పాలనా చూడని కూటమి ప్రభుత్వం

2019కి ముందు టీడీపీ హయాంలో.. కాలనీల్లో పార్కులంటే పిచ్చి తుప్పలు.. డొంకలతో నిండిన ఓ ఖాళీ స్థలం.. ఎక్కడో ఒకచోట కాలనీవాసులు ముందుకు వచ్చి పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసుకుంటే ఆ పార్కుల్లో కాస్త ఆహ్లాదం.. కాలక్షేపం. అంతకు మించి పార్కుల్లో చూడ్డానికి ఏమీ లేని పరిస్థితి.

2024 కూటమి ప్రభుత్వ హయాంలో.. ప్రస్తుతం మళ్లీ కథ మొదటికే వచ్చింది. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన పార్కులు కళ తప్పాయి. తుప్పలు, డొంకలు, ప్రమాదకర పాముల పుట్టలతో పార్కులు పాడైపోయాయి. రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ప్రజలకు అక్కరకు రాకుండా పోయాయి. సామగ్రి విరిగిపోయి.. తుప్పు పట్టిపోయాయి. ఓపెన్ జిమ్‌లు కాస్త ఓపెన్ బార్లుగా.. ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి.

2019 తరువాత వైఎస్సార్‌సీపీ పాలనలో.. జీవీఎంసీ సారథ్యంలో కాలనీల్లోని పార్కులను సమూలంగా ప్రక్షాళన చేసింది. పార్కులను పూర్తిస్థాయి అభివృద్ధి పథంలో నడిపింది. జోన్-8 పరిధిలో రూ.కోట్ల నిధులు వెచ్చించి కాలనీల్లోని పార్కులను అత్యాధునికంగా తీర్చిదిద్దింది. ప్రజల ఆరోగ్యం కోసం ఐదేళ్లలో జీవీఎంసీ ద్వారా పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను విజయవంతంగా నిర్వహించింది.



కళా విహీనంగా జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్ సీ-2 జోన్ పార్కు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన సుజాతనగర్ సీ-2 జోన్ పార్కులో ప్రస్తుతం వెలసిన పాముల పుట్ట



96వ వార్డు సాయినిరంజన్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో విరిగిన సామగ్రి

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జోన్-8 పరిధిలోని పార్కుల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేసింది. ఉదాహరణకు జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని సీ-2 జోన్ పార్కును రూ.40 లక్షల నిధులతో జీవీఎంసీ, పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేశారు. విద్యుత్ సౌకర్యం కోసం రూ.7 లక్షల ఎమ్మెల్యే నిధులతో అప్పట్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సారథ్యంలో వెచ్చించారు. ఈ క్రమంలో పార్కు నిర్వహణ కోసం పార్కులో భవనాన్ని నిర్మించి దాన్ని వార్డు సచివాలయానికి అద్దెకు ఇచ్చారు. దాంతో పాటు పార్కులో స్కేటింగ్ రింగ్‌ను కూడా అద్దె పద్ధతిలో ఇచ్చారు. ప్రారంభంలో సకాలంలో అద్దెలు రావడంతో పార్కు నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ గత ఏడెనిమిది నెలలుగా సచివాలయం నుంచి ప్రభుత్వం అద్దె ఇవ్వడం లేదు. అదే సమయంలో స్కేటింగ్ కోసం ఏర్పాటు చేసిన రిం క్‌కు సైతం సదరు వ్యక్తి అద్దె చెల్లించడం లేదు. ఈ క్రమంలో పార్కు నిర్వహణను జీవీఎంసీ కూడా వదిలేసింది. దీంతో పాముల పుట్టలు, పిచ్చి తుప్పలు పెరిగిపోయాయి. ఇలా చెప్పుకుంటూ పోతే జోన్-8 పరిధిలో పదుల సంఖ్యలో పార్కుల దుస్థితి ఇలాగే ఉంది.

ఓపెన్ బార్‌లే:
మరో వైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల ఆరోగ్యం కోసం జోన్-8 పరిధిలో అనేక కాలనీల్లో పార్కులు/ఖాళీ స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 97వ వార్డు సత్యానగర్, ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో నాలుగు పార్కుల్లో మొత్తం రూ.25 లక్షల వరకు నిధులు విడుదల చేసి ఓపెన్ జిమ్‌ల సౌకర్యం కల్పించారు. చినముషిడివాడ వుడా కాలనీలో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రినగర్, అప్పన్నపాలెం, గోశాల కూడలి, భరత్‌నగర్‌లలో ఒక్కో జిమ్‌కు రూ.5 లక్షల వరకు జీవీఎంసీ కేటాయించింది. పెందుర్తి సాయి నిరంజన్ కాలనీలో రూ.10 లక్షలు పెట్టి ఓపెన్ జిమ్ పెట్టారు. రత్నగిరినగర్ అయితే స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటుకు రూ.1.98 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం రత్నగిరినగర్ పార్కులోని జిమ్ సామగ్రి మాత్రమే ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయి. మిగిలిన చోట్ల చాలా వరకు సామగ్రి తుప్పు పట్టడం, విరిగిపోవడంతో ప్రజలు వాటిని ఉపయోగించడం మానేశారు. ఆయా ప్రాంతాల ఆకతాయిలకు మాత్రం మద్యం సేవించడానికి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ఆయా పార్కులు, జిమ్‌ల నిర్వహణపై దృష్టి సారించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కులు, జిమ్‌ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.



సుజాతనగర్ సీ-2 జోన్ పార్కులో ఉన్న సచివాలయం చుట్టూ తుప్పలు

పార్కుల నిర్వహణపై దృష్టి సారిస్తాం..



కొన్ని వార్డుల్లోని పార్కులు, ఓపెన్ జిమ్‌ల నిర్వహణ అంశం మా దృష్టికి వచ్చింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా దీనిపై వినతులు వస్తున్నాయి. నిర్వహణకు ఇబ్బందులు ఉన్న పార్కులను గుర్తించి అక్కడి కమిటీలతో మాట్లాడతాం. మా పరిధిలో ఉన్నవి కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన బాధ్యతలు సంబంధిత అధికారులకు అప్పగిస్తాం.

–కె.హేమవతి, జోనల్ కమిషనర్, జోన్-8

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పార్కుల నిర్వహణ విషయంలో మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. మేం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసిన పార్కుల బాధ్యత ఆయా కమిటీలు చూసుకోవాలి. అయితే నిర్వహణ కోసం నిధుల విషయం మా పరిధిలోని కాదు. సమస్యలున్న పార్కులను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– గానిబాబు, ఉద్యానశాఖ అధికారి, జీవీఎంసీ

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, దాడి నూకరాజు

గోపాలపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ 88వ వార్డు నాయకుడు దాడి నూకరాజు కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం చాలా సంతోషాన్నిచ్చిందని వారు తెలిపారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి పూజలు



కొలువుదీరిన హనుమంతుడు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో కొలువుదీరిన ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణం నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, సుందరకాండ పారాయణం కొనసాగింపు, నివేదనలు నిర్వహించనున్నారు. 22న హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి పంచామృతాభిషేకం, విశేష సహస్రనామార్చన, శ్రీరామ పట్టాభిషేక సర్గ, హోమం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు, అడవివరం గ్రామస్తులు ఈ పూజల్లో పాల్గొని తరించాలని దేవస్థానం ఈవో సుజాత కోరారు.

ఘనంగా కనకదుర్గమ్మ పండగ



పూజలందుకున్న కనకదుర్గమ్మ

పెందుర్తి: మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం)లో కొలువైన కనకదుర్గమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. దాదాపు 3 వేల మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అనుపోత్సవం సంప్రదాయబద్ధంగా జరిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



తరుణ్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: బీహార్ రాష్ట్రం రాజగిరి పట్టణంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ 81 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ట్రాలర్ నుంచి జారిన ఐరన్ షీట్ రోల్



అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్ లారీ నుంచి మంగళవారం వేకువ జామున ఐరన్ షీట్ రోల్ జారి పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. షీలానగర్ నుంచి ఆటోనగర్ లోపలకు ట్రాలర్‌పై ఐరన్ షీట్ రోల్స్ వెళ్తున్నాయి. సరిగ్గా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి మలుపు తిరుగుతున్న ట్రాలర్‌పై నుంచి రోల్ రోడ్డు మధ్యలో పడిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వెంటనే ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగింది. రోల్ అవ్వకుండా చైన్‌తో కట్టడం, ఐరన్ బెల్టులతో బిగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ రోల్ అవ్వకుండా చెక్కలు, ఇతర దిమ్మలు లాంటి వాటిని తూతూ మంత్రంగా పెట్టి తరలిస్తుంటారు. వీటిపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



పరవాడ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అసంఘటిత కార్మికులు

పరవాడ: లేబర్ కోడ్లను రద్దు చేసి అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పరవాడ, లంకెలపాలెం కూడళ్లలో మంగళవారం అసంఘటిత కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత కార్మిక చట్టాలన్నిటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌ను తీసుకువస్తుందన్నారు. లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇది నిరంకుశ విధానాలను అవలంబించడమేనన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయడానికి కార్మిక సంఘాలు ముందుకు రావాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కర్ణం వెంకటరావు, వెంకటస్వామి, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

ఘనంగా మర్లమాంబ మారువారం పండగ



మర్లమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న గండి రవికుమార్, తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం గ్రామంలో కొలువైన మర్లమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో గ్రామస్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సబ్బవరపు నాగభూషణం, వార్డు మెంబర్లు గొర్లె శ్రీను, బోకం రామకృష్ణ, సబ్బవరపు శివ, చిత్రాడ శ్రీను, మాజీ ఉప సర్పంచ్ సబ్బవరపు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

- కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణంలో 80 మంది భూనిర్వాసితులు
- పొర్లుపాలెం రైతుల సమావేశంలో తహసీల్దార్ ఆనంద్ వెల్లడి



పొర్లుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: గోపాలపట్నం నార్త్ సింహాచలం నుంచి కొత్తవలస వరకు రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ వెల్లడించారని పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ రైతులకు తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిరప్రసాద్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అధికారుల మధ్య జరిగిన సమావేశంలో పరిహారం అంశం చర్చించారని చెప్పారు. మంగళవారం పొర్లుపాలెంలో రైతులతో జరిగిన చర్చలో ఆయా విషయాలను తహసీల్దార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి సమావేశంలో రైల్వే ట్రాక్ సమీపంలో అనుభవం, సాగులో ఉన్న రైతులు దాదాపు 80 మంది వరకు ఉన్నట్లు గుర్తించారన్నారు. భూములు కోల్పోతున్న రైతుల తుది జాబితాను త్వరలో రూపొందిస్తామన్నారు. వచ్చే నెలలో జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. రైతుల సాగులో ఉన్న భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్నందున దేవస్థానం అధికారులతో కూడా ఉన్నతాధికారులు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. పలువురు అధికారులు, స్థానిక గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కథలు నేర్చుకుందాం రండి..



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

నేడు పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఫార్మాసిటీలో ఆవిష్కరించనున్న అభయాంజనేయస్వామి విగ్రహం



స్వామివారికి పూజలు చేస్తున్న మెట్రోకెం పరిశ్రమ అధినేత వెంకటేశ్వరరావు దంపతులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో మెట్రోకెం పరిశ్రమ యాజమాన్యం సహకారంతో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శ్రీఅభయాంజనేయస్వామి విరాట్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కళా హోమం, స్వర్ణ, రజిత, యంత్రాలకు అభిషేకాలు, గర్తన్యాసం, రత్నన్యాసం, బీజన్యాసం పూజలతో బుధవారం ఉదయం 8.51 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, 10 గంటలకు అభయాంజనేయస్వామి విరాట్ విగ్రహ ఆవిష్కరణ చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో పరిశ్రమ అధినేత నందెపు వెంకటేశ్వరరావు దంపతులు సుదర్శన హోమం, సాయంత్రం పునః పూజలు, మూలమంత్ర హోమం, పంచశయ్యాధి వాసంలు, దర్బార్ సేవ, చతుర్వేద స్వస్తి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక
- బార్లు, మద్యం షాపులు, హోటళ్లకు నోటీసులు



మద్యం దుకాణం ప్రతినిధికి నోటీసు అందిస్తున్న సీఐ

పెందుర్తి: సమయ పాలన పాటించకుండా.. నిబంధనలు అతిక్రమించి బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయా వ్యాపారాలు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మంగళవారం పెందుర్తి సర్కిల్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లకు సమయ పాలన, అనధికారిక విక్రయాలపై యాజమాన్యాలకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం విక్రయాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్‌లు 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యాన్ని, హోటళ్ల రాత్రి 12 గంటల వరకు మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు. నిబంధనలు మీరితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రతి దుకాణానికి లైసెన్స్, ఫైర్ ఎన్‌ఓసీ, జీవీఎంసీ/పంచాయతీ అనుమతితో పాటు ఆయా వ్యాపార సంస్థల్లో పనిచేసే సిబ్బంది కాండాక్ట్ ధ్రువీకరణ పత్రం తమ నుంచి తీసుకోవాలని సూచించారు.

తూనికలు, కొలతల్లో కచ్చితత్వం అవసరం



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ రాజేష్

సీతంపేట: వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్, డిప్యూటీ కంట్రోలర్ కె.టి.రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకం, కొలతల్లో కచ్చితత్వం కోసం వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. కొనుగోలు సమయంలో వస్తు నాణ్యత, వాటి తయారీ, తూనిక, కొలతలు, ఎమ్మార్పీ వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్యాకేజీ రూపంలో ఉండే ఏ వస్తువుకైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర వినియోగదారులు చెల్లించనవసరం లేదన్నారు. వినియోగదారులు ఎలా మోసపోతున్నారు, వ్యాపారులు ఎలా మోసగిస్తారో వివరించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర డిమాండ్ చేస్తే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో విశాఖ కన్స్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధి శత్రుఘ్నుడు, అసిస్టెంట్ కంట్రోలర్లు పి.డి.వి. అప్పలరాజు, బి.రామచంద్రయ్య, పి.చిన్నమ్మ, ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, ఎస్.ఉమాసుందరి పాల్గొన్నారు.

• సింహగిరి మేఘసిరి

ఘాట్‌రోడ్డు నుంచి కిందికి చూస్తే కనువిందు చేసిన అద్భుత దృశ్యం



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహుని క్షేత్రమైన సింహగిరిని మంగళవారం కరిమబ్బులు గొడుగు పట్టాయి. కొండలపై నుంచి ఆలయ రాజగోపురం మీదికి జాలువారుతున్నట్లున్న మేఘాలను చూసి భక్తులు పరవశించారు. ఘాట్‌రోడ్డు మీదుగా కిందికి చూస్తే అడవివరం గ్రామంపైన వెండి మబ్బుల దోబూచులాట కనువిందు చేసింది. కొండలపై నుంచి వచ్చే మేఘాలను చూస్తూ పలువురు భక్తులు, యాత్రికులు తమ మొబైళ్లతో ఆ దృశ్యాలను బంధించడంలో బిజీ అయ్యారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

